

ప్రమాదాల కట్టడికి తనిఖీలు

వేగంగా వాహనాలు నడపడం, మైనర్లు డ్రైవింగ్ చేస్తుండడంతో జరుగుతున్న ప్రమాదాల కట్టడికి పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. 8లో



మిర్చి బోర్డు ఏర్పాటుచేయాలి

మిర్చి రైతులకు మద్దతు ధర దక్కేలా పాలకులు ప్రత్యేక బోర్డు ఏర్పాటుచేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 36° / 19°

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రత పెరిగే అవకాశముంది. ఉదయమే ఎండ మొదలై మధ్యాహ్నానికి మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

జిల్లా జైలును పరిశీలించిన న్యాయమూర్తి



మహిళా ఖైదీతో మాట్లాడుతున్న జడ్జి చంద్రశేఖర్

ఖమ్మంరూరల్: మండలంలోని రామన్నపేటలో జిల్లా జైలును న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్ బుధవారం పరిశీలించారు. జైలులోని బ్యారక్‌లను పరిశీలించిన ఆయన ఖైదీలతో మాట్లాడి వారికి ఇస్తున్న ఆహారం, అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అలాగే, మహిళా ఖైదీలకు సత్యమార్గం యూత్ సర్వీసెస్ ఆధ్వర్యాన పేపర్ బ్యాగ్‌ల తయారీలో ఇస్తున్న శిక్షణ వివరాలు తెలుసుకున్నారు. ఖైదీలు సత్ప్రవర్తనతో ఉంటూ శిక్షాకాలం ముగిశాక స్వయం ఉపాధి పొందాలని సూచించారు. జైలు సూపరింటెండెంట్ శ్రీధర్, జైలర్ లక్ష్మీనారాయణ, యూత్ సర్వీసెస్ సభ్యులు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ధాన్యం కొనుగోళ్లు

- వైరా, బోనకల్ మండలాల్లో అనుమతి

ఖమ్మంసహకారనగర్: జిల్లాలోని వైరా, బోనకల్ మండలాల్లో ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం అనుమతి జారీ చేసింది. గతనెల 31వ తేదీతో జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముగిశాయని అధికారులు ప్రకటించారు. ఈమేరకు జిల్లాలోని 344 కేంద్రాల ద్వారా 51,283 మంది రైతుల నుంచి 2,95,258.280 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. అయితే, వైరా మండలంలోని సిరిపురం, ఉప్పలమడక, బోనకల్ మండలంలోని బ్రాహ్మణపల్లి, మోటమర్రి, కలకోట గ్రామాల్లో ఇంకా ధాన్యం మిగలగా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. దీంతో ప్రభుత్వం అనుమతి జారీచేయగా ఆయా గ్రామాల్లో 15వేల క్వింటాళ్ల ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేశామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ తెలిపారు.

నిర్వహణ లోపాలపై జెడ్పీ సీఈఓ అసహనం



స్టోర్‌రూమ్‌లో పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ దీక్ష, అధికారులు

వైరారూరల్: మండలంలోని ముసలిమడుగులో తెలంగాణ గిరిజన సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల నిర్వహణపై జెడ్పీ సీఈఓ దీక్షారైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. డీపీఓ ఆశలత, డీఎల్‌పీఓ రాంబాబుతో కలిసి ఆమె గురుకులాన్ని తనిఖీ చేయగా వంట గది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. వంట గది అపరిశుభ్రంగా ఉండడం, నాణ్యత లేని కూరగాయలు కనిపించడంతో పాటు పాఠశాల ఆవరణలో దుర్వాసన వస్తుండగా ప్రిన్సిపాల్ మాధవీలతను ప్రశ్నించారు. నిర్వహణ లోపాలపై మందలించిన సీఈఓ, ఇకనైనా విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

ఏన్కూరు: విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించేలా గురువారం సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ ఎన్.వీ.వేణుగోపాలచారి తెలిపారు. ఏన్కూరులోని సబ్‌స్టేషన్‌లో ఉదయం 10–30నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సదస్సు జరుగుతుందని వెల్లడించారు. ట్రాన్స్‌ఫార్మర్లలో లోపాలు, లో ఓల్టేజీ, నూతన సర్వీసుల మంజూరు, పేరు మార్పిడి, బిల్లుల్లో హెచ్చుతగ్గులు తదితర సమస్యలపై రాతపూర్వకంగా పిర్యాదు చేయొచ్చని తెలిపారు. ఏన్కూరు, తల్లాడ మండలాల వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఓ ప్రకటనలో సూచించారు.

పలు రైళ్ల రద్దు.. ఇంకొన్ని దారి మళ్లింపు

ఖమ్మం రాపర్తినగర్: మూడో లైన్ నిర్మాణ పనుల కారణంగా ఖమ్మం మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేయగా, ఇంకొన్నింటిని దారి మళ్లిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కాజీపేట – విజయవాడ మార్గంలో నడిచే 30 రైళ్లను ఈనెల 10నుంచి 20వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇంకొన్నింటిని సికింద్రాబాద్ – నడికుడి మార్గంలో నడిపించనున్నట్లు వెల్లడించారు. అలాగే, వారాంతపు రైళ్లను కూడా రద్దు చేయగా మరికొన్ని రైళ్లు నిర్ణీత తేదీల్లోనే నడుస్తాయని తెలిపారు.

పొట్ట కొట్టిన వరి

15-40 రోజుల్లోనే పొట్టదశ.. పిండి పోసుకోని కంకి

- రఘునాథపాలెం, సత్తుపల్లి తదితర మండలాల్లో రైతుల ఆవేదన
- ఎకరాకు రూ.30వేలకు పైగా నష్టపోయామని వెల్లడి
- పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు



కోయచెలకలో ముందే పొట్ట దశకు చేరిన వరి పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు, అధికారులు



నీరు పెట్టకపోవడంతో ఎండిపోతున్న పొలం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: యాసంగిలో వరి సాగు చేసిన రైతులకు విత్తనాల రూపాన ఆదిలోనే ఎదురుదెబ్బ తాకింది. నాటు వేసిన 15 నుంచి 40 రోజుల్లోనే పొట్ట దశకు చేరగా, కంకి పిండి పోసుకోకపోవడం, పొడవు పెరగని నేపథ్యాన అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలోని రఘునాథపాలెం మండలం కోయచెలక, రేగులచెలక, చిమ్మపుడి, సత్తుపల్లి మండలంలోని రేజర్ల, కొత్తూరు, సిద్దారం తదితర గ్రామాల్లో సుమారు 500ఎకరాల్లో పంట పరిస్థితి ఇలాగే ఉండడంతో రైతులు వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించడమే కాక విత్తన కంపెనీ బాధ్యుల దృష్టికి తీసుకెళ్లారు. ఈనేపథ్యాన వ్యవసాయ శాఖ అధికారులతో పాటు, వైరా కేవీకే శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పరిశీలించగా పెట్టిన

పరిశీలించిన శాస్త్రవేత్తలు

డీలర్లు కల్తీ విత్తనాలు ఇవ్వడంతోనే ఇలా జరిగిందని చెబుతున్న రైతులు కంపెనీ బాధ్యులతో పాటు వ్యవసాయ శాఖ అధికారులకు తెలిపారు. దీంతో అధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించి పిలక దశలోనే కంకి రావడాన్ని గుర్తించారు. ఈమేరకు బాధిత రైతుల నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు. అయితే, కంపెనీ ప్రతినిధులు మాత్రం చల్లటి వాతావరణం కారణంగానే ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నట్లు సమాచారం.

పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేనందున కంపెనీల నుంచి పరిహారం ఇప్పించాలని కోరారు.

పెట్టుబడి పోయినట్టేనా

ఒక్కో ప్రాంత రైతులంతా ఒకేచోట విత్తనాలు కొనుగోలు చేశారు. దుక్కులు దున్నడం, నాట్లు వేయడంతోపాటు మందులు, ఎరువుల కోసం ఇప్పటికే ఎకరానికి రూ.35 వేల మేర వెచ్చించారు. కొందరు రైతులు భూమి కౌలు తీసుకుని ఎకరానికి రూ.8వేల నుంచి రూ.12 వేల వరకు ముందే చెల్లించారు. దీంతో ఎకరానికి దాదాపు రూ.50 వేల వరకు నష్టపోయామని ఆవేదన చెందుతున్న రైతులు పంటను కాపాడుకోవడానికి మందులు వాడాలా.. లేక వదిలేయాలా అన్న సందిగ్ధ పరిస్థితి ఎదుర్కొంటున్నారు. కొందరు రైతులు మరోమారు పెట్టుబడి పెట్టే పరిస్థితి లేక పంట వదిలేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక



ముందే కంకి రావడంతో పంట కొంత మేర దెబ్బతిన్నట్లు కనిపిస్తోంది. మొత్తంగా 40 శాతం పంట దిగుబడి తగ్గే అవకాశముంది. చల్లటి వాతావరణంతోనూ ఇలా జరగొచ్చు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం.

– ఉమామహేశ్వర్‌రెడ్డి, ఏఓ, రఘునాథపాలెం

జానెడు కూడా లేని కంకి..

యాసంగిలో జిల్లాలోని 2,10,830 ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటివరకు 1,78,922 ఎకరాల్లో రైతులు పంట సాగు చేశారు. ప్రైవేట్ డీలర్లు, తెలంగాణ ఆగ్రో ఏజెన్సీస్ వద్ద విత్తనాలు కొనుగోలు చేయగా రఘునాథపాలెం, సత్తుపల్లి మండలాల రైతులు ఓంకార్ ఎన్‌పీ 3056, ఆర్‌ఎన్‌ఆర్ 15048 సన్న రకాలు నాటారు. పలుచోట్ల నాట్లు వేసిన 15 నుంచి 40 రోజుల్లోనే పొట్ట దశకు చేరడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. రఘునాథపాలెం మండలంలోనైతే పైరు పూర్తిగా పెరగకుండా పిలక దశలోనే కంకులు వేశాయి. ఈ కంకులు జానెడు పొడవు కూడా లేక పిండి పోసుకోకపోవడంతో పంట ఆగదని రైతులు వాపోతున్నారు.



కోయచెలకలో 30రోజుల్లోనే పొట్టకు వచ్చిన వరి

40 రోజుల్లోనే వరి ఈనింది..



ఓంకార్ వరి విత్తనాల బ్యాగ్ రూ.వెయ్యికి కొనుగోలు చేశా. 85 – 90 రోజులకు బదులు 30 – 40 రోజుల్లోనే పొట్ట దశకు చేరింది. చలి వాతావరణమైతే అన్ని కంపెనీలవి ఎందుకు కాలేదో చెప్పాలి. కల్తీ విత్తనాలే ఇందుకు కారణం.

– మారంశెట్టి కృష్ణ, కోయచెలక, రఘునాథపాలెం మండలం

అయోమయంలో ఉన్నాం..



రెండు ఎకరాల్లో ఓంకార్ విత్తనాలతో సాగుచేశా. 40 రోజుల్లోనే ఈనుతుండడంతో ఏం చేయాలో పాలు పోవడం లేదు. ఇప్పటికే పెట్టుబడి ఎక్కువైంది. కంపెనీ వాళ్లు, అధికారులు, శాస్త్రవేత్తలు చూసి వెళ్తున్నా లాభం కనిపించడం లేదు.

– చెరుకూరి నరేష్, కోయచెలక, రఘునాథపాలెం

మునుపెన్నడూ జరగలేదు..



ఏటా యాసంగిలో వరి వేస్తున్నా గతంలో ఎలా ఎప్పుడూ జరగలేదు. మా గ్రామంలో 40 మందికి పైగా ఓంకార్ రకం వరి విత్తనాలు నాటాం. కానీ కంకి సరైన పొడవు రావడం లేదు. ఈసారి పంట చేతికి వచ్చే పరిస్థితి కానరావడం లేదు.

– మద్దాల శ్రీను, కోయచెలక, రఘునాథపాలెం

పరిహారం ఇప్పించాలి..



ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకం విత్తనాన్ని 30 ఎకరాల్లో సాగు చేశా. నాటు వేసిన 15 రోజుల నుంచే పొట్టదశకు, 30 రోజుల్లో ఈనే దశకు వచ్చింది. దీంతో దిగుబడిపై ప్రభావం పడుతుంది. ప్రభుత్వమే పరిహారం ఇప్పించి ఆదుకోవాలి.

– పులగం అంజిరెడ్డి, రేజర్ల, సత్తుపల్లి మండలం

ప్రణాళికతో చదివితే విజయం సులువే...

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ఎన్నెస్పీ క్యాంప్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో కలిసి కూర్చున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పక్కన డీఈఓ శర్మ తదితరులు

ఖమ్మంసహకారనగర్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవడమే కాక ప్రణాళికాయుతంగా చదివితే విజయం సులువుగా సొంతమవుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మం ఎన్నెస్పీ క్యాంప్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల సమీపిస్తున్న నేపథ్యాన బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సదస్సుకు హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయాన వేగంగా వెళ్తే ప్రమాదం జరుగుతుందనే భయం ఉండడం సహజమే అయినా ఆ భయాన్ని ఎలా అధిగమించాలో గుర్తించాలన్నారు. అదేమాదిరి పరీక్షల వేళ భయం తగ్గేందుకు ప్రణాళికతో చదవాలని సూచించారు. రానున్న నెల పాటు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పరీక్షకు సిద్ధమైతే ఆటంకాలను అధిగమించవచ్చని కలెక్టర్ తెలిపారు. తొలుత మోటివేషన్ స్పీకర్ నాగేశ్వరరావు ప్రసంగాన్ని కలెక్టర్ విద్యార్థులతో కలిసి కూర్చుని విన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి సోమశేఖరశర్మ, పాఠశాల హెచ్ఎం రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా ప్రాంగణం అభివృద్ధికి నిధులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం టేకులపల్లిలోని జిల్లా మహిళా ప్రాంగణం అభివృద్ధి, సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయిస్తామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థినులు ఇటీవల ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఏఎన్ఎం) కోర్సులో రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు సాధించగా కలెక్టర్ ప్రాంగణానికి వచ్చారు. ఈ సందర్భంగా ఉన్న వసతులు, తరగతి గదులను పరిశీలించడమే కాక రాష్ట్రస్థాయిలో మొదటి, రెండో ర్యాంకులు సాధించిన పావని, ఎస్.మనీల తదితరులకు జ్ఞాపికలు అందజేశారు. ఆతర్వాత వారితో కలిసి భోజనం చేశారు. ఈమేరకు మౌలిక సదుపాయాలపై మేనేజర్ వేల్పుల విజేత వివరించగా త్వరలోనే పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఉద్యోగులు నాగ సరస్వతి, స్పందన, హిమబిందు, మల్లిక, విజయ్‌కుమార్, సుకన్య, మౌనిక, లాలయ్య, పల్లవి, దుర్గారావు, శాంతమ్మ, కళ్యాణి పాల్గొన్నారు.

మెనూ అమలవుతోందా, బోధన ఎలా ఉంది?

- గురుకులంలో పీఆర్ కమిషనర్ సృజన తనిఖీ
- అదనపు కలెక్టర్, విద్యార్థినులతో కలిసి భోజనం, సౌకర్యాలపై ఆరా



భోజనం చేస్తున్న పీఆర్ కమిషనర్ సృజన, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ, తదితరులు

వైరారూరల్: వైరా మండలం ముసలిమడుగులోని గిరిజన సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను బుధవారం రాత్రి రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ సృజన తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి వచ్చిన ఆమె పాఠశాలలోని వంటగది, స్టోర్ రూం, డార్మిటరీ హాళ్లను పరిశీ లించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థినులతో సమావేశమైన సృజన మెనూ అమలు, బోధన, ఇతర వసతులపై ఆరాతీశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థినుల సౌకర్యార్థం ప్రభుత్వం గురుకులాల్లో అన్ని వసతులు కల్పిస్తోందని తెలిపారు. ఈమేరకు సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీపీఓ ఆశాలత, ఎస్సీ డీడీ కె.సత్యనారాయణ, డీఎల్‌పీఓ రాంబాబు, తహసీల్దార్ కే.వీ.శ్రీనివాస్, ఎంపీడీఓ పి.సరస్వతి, ఎంపీఓ జ్యోత్స్నాదేవి, ప్రిన్సిపాల్ మాధవీలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన

కారేపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల సంసిద్ధతలో భాగంగా ఏర్పాట్లను అదనపు కలెక్టర్ శ్రీజ పరిశీలించారు. కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం ఏర్పాటుచేయనుండగా ఇక్కడ వసతులను బుధవారం ఆమె పరిశీలించి అధికారులతో చర్చించారు. ఎన్నికలకు ముందు రోజు ఉద్యోగులు ఇక్కడే సామగ్రి తీసుకోవాల్సి ఉన్నందున, సామగ్రి భద్రతకు ఏర్పాట్లు, ఇతర సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుందని తెలిపారు. కాగా, జూనియర్ కళాశాలలో కొన్ని గదులు శిథిలావస్థకు చేరడంతో స్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయని అధ్యాపకులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అయితే, మరమ్మతులకు రూ.30లక్షల నిధులను కలెక్టర్ కేటాయించారని ఎంపీడీఓ సురేందర్, తహశీల్దార్ సంపత్‌కుమార్ తెలిపారు. తొలుత అదనపు కలెక్టర్ శ్రీజ సింగరేణి మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ల జాబితా పరిశీలనపై ఆరా తీశారు.

టైగర్..‘భద్ర’!

- మణుగూరు అడవుల్లో రెండు నెలలుగా పెద్దపులి మకాం
- ట్రాపింగ్ కెమెరాలకు చిక్కిన బెబ్బులి
- మూడేళ్ల తర్వాత కనిపించిన అడుగుజాడలు
- మగపులిగా నిర్ధారణ.. భద్ర అని నామకరణం




మణుగూరు అటవీ ప్రాంతంలో ట్రాపింగ్ కెమెరాకు చిక్కిన పెద్దపులి

పాల్వంచరూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్టుగా అధికారులు గుర్తించారు. గత కొన్నేళ్లుగా పులి అప్పుడప్పుడు జిల్లాలోకి ప్రవేశిస్తున్నా.. కొన్ని రోజుల సంచారం తర్వాత వెళ్లిపోయేది. అయితే గత డిసెంబర్ 10న ఏటూరునాగారం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్, ములుగు అటవీ ప్రాంతం మీదుగా వెంకటాపురం(కె)మండలం బోదాపురంలోకి ప్రవేశించింది. అక్కడి నుంచి మల్లూరు గుట్టల మీదుగా మణుగూరు అటవీ ప్రాంతంలోకి వచ్చినట్లు గుర్తించిన అటవీ శాఖ అధికారులు అప్రమత్తమై ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు.

10 లక్షల ఎకరాల్లో అడవి..

భద్రాద్రి జిల్లా అటవీ విస్తీర్ణం 10 లక్షల ఎకరాలు కాగా, ఇందులో కిన్నెరసాని అభయారణ్యం 634.4 చదరపు కిలోమీటర్లుగా ఉంది. గొత్తికోయల ఆవాసాలు, రెండు లక్షల ఎకరాల్లో పోడు సాగు, మరో లక్ష ఎకరాల అడవిని నరికి వేయడంతో క్రమంగా విస్తీర్ణం తగ్గింది. దీంతో జిల్లాలో పులులు మనుగడ సాగించలేక పోతున్నాయి. అయితే గత ఆరేడేళ్లుగా ప్లాంటేషన్ పెంచడంతో క్రమంగా అడవి పెరుగుతోంది. 2018 తర్వాత జిల్లాలో పెద్దపులి ఆవాసం ఏర్పర్చుకోకపోగా, మూడేళ్లుగా జిల్లాలోకి ప్రవేశిస్తున్నా కొద్దిరోజులే జిల్లా దాటుతోంది. దీంతో రెండు నెలల క్రితం వచ్చిన పులి తిరిగి వెళ్లకుండా చర్యలు చేపట్టారు. గొత్తికోయలు, గిరిజనులు వేటాకుండా అవగాహన కల్పించడంతో ఫలితం కనిపిస్తోంది. ఎట్టకేలకు రెండు నెలలుగా పులి జిల్లా దాటకపోవడంతో మగపులిగా నిర్ధారించిన అధికారులు.. భద్ర అని నామకరణం చేశారు. ప్రస్తుతం మేటింగ్ సమయం కావడంతో ఆడ పులి కూడా ఉండొచ్చని భావిస్తున్నారు. ఈనెల 2వ తేదీన మణుగూరు అటవీ ప్రాంతంలో ట్రాపింగ్ కెమెరాకు మగ పులి మాత్రమే చిక్కిందని డీఎఫ్ఓ కృష్ణాగౌడ్ బుధవారం ధ్రువీకరించారు.

పులి ఇక్కడే ఉండేలా చర్యలు



జిల్లాలోని మణుగూరు అటవీ ప్రాంతంలో రెండు నెలలుగా పెద్దపులి మకాం వేసింది. జిల్లాకు ఉన్న కీర్తిప్రతిష్టల ఆధారంగా దానికి ‘భద్ర’గా నామకరణం చేశాం. ప్రజలెవరూ ఆందోళన చెందకుండా పులి కనిపిస్తే అటవీ అధికారులకు సమాచరం ఇవ్వాలి. అడవిలో నీటి వనరులను అందుబాటులోకి తీసుకొచ్చి పులులకు ఆహారమైన సాంబార్, జింకల సంతతి పెంపుపై దృష్టి పెట్టాం.

– కృష్ణాగౌడ్, భద్రాద్రి జిల్లా అటవీ శాఖాధికారి

తల్లీకుమారుడికి జీవిత ఖైదు

వివాహిత హత్య కేసులో తీర్పు

ఖమ్మంలీగల్: వివాహితను హత్య చేసినట్లు తేలడంతో ముదిగొండ మండలం బాణాపురం తండాకు చెందిన ఆమె భర్త తేజావత్ ఉపేందర్ నాయక్, అత్త తేజావత్ పద్మకు జీవిత ఖైదు విధిస్తూ ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం పాలారం తండాకు చెందిన భూక్యా కాలియా తన కుమార్తె కల్యాణిని రూ.4.50 లక్షల కట్నం ఇచ్చి ఉపేందర్‌తో 2017లో వివాహం జరిపించాడు. ఏడాది పాటు కాపురం సజావుగానే సాగగా వీరికి కుమార్తె జన్మించింది. ఆ తర్వాత ఉపేందర్ మంగాపురం తండాకు చెందిన ఇస్లావత్ అరుణతో వివాహేతర సంబంధం పెట్టుకుని అదనపు కట్నం తీసుకురావాలని కల్యాణిని వేధించసాగాడు. ఆయనకు తల్లి పద్మ, తండ్రి కృష్ణ, సోదరి కవితతో పాటు అరుణ జత కలిసి కల్యాణిని వేధిస్తూ కూల్‌డ్రింక్‌లో విషం కలిపి చంపటానికి ప్రయత్నించగా తప్పించుకుని తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. దీంతో పెద్దల సమక్షాన మాట్లాడి ఆగస్టు 2019లో పొలం అమ్మి విడతల వారీగా రూ.12 లక్షల వరకు చెల్లించారు. అయితే, 2020 ఫిబ్రవరి 12న కాలియాకు ఫోన్ చేసిన ఉపేందర్ కల్యాణి కళ్లు తిరిగి కింద పడిందని చెప్పగా వెళ్లేసరికి గొంతు, రెండు కాళ్లపై గాయాలు ఉండటంతో హత్య చేసినట్లు గుర్తించాడు. ఈ మేరకు ఉపేందర్, ఆయన తల్లిదండ్రులు పద్మ, కృష్ణ, మంగాపురం తండాకు చెందిన అరుణ, ముదిగొండకు చెందిన దారా కవిత తన కుమార్తెను హత్య చేశారని ఫిర్యాదు చేయగా పోలీసులు ఐదుగురిపై హత్యానేరం కింద కేసు నమోదు చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో 21 మంది సాక్షులను న్యాయమూర్తి విచారించగా కల్యాణి భర్త ఉపేందర్, ఆయన తల్లి పద్మపై నేరం రుజువైనందున యావజ్జీవ శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో మిగిలిన ముగ్గురిపై కేసు కొట్టేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.శంకర్ వాదించగా లైజన్ అధికారులు శ్రీకాంత్, రషీద్, నాగేశ్వరరావు, ఏఎస్ఐ సూర్యనారాయణ కానిస్టేబుల్ ఆదినారాయణ హోంగార్డ్ యూసుఫ్ సహకరించారు.

క్లుప్తంగా

ప్రత్యేక మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా మిర్చి బోర్డు ఏర్పాటు చేసి మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా పంట కొనుగోలు చేయాలని, తద్వారా రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు యర్రా శ్రీకాంత్ పేర్కొన్నారు. సీపీఎం నాయకులు బుధవారం ఖమ్మం మార్కెట్‌ను సందర్శించి ధరలపై ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పెట్టుబడి పెరిగి, దిగుబడి తగ్గుతున్న నేపథ్యాన మద్దతు ధర దక్కక రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఈ నేపథ్యాన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిర్చి కొనుగోళ్లకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని, జెండా పాట ప్రకారం కొనుగోళ్లు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మార్కెట్ చైర్మన్ హన్మంతరావు, కార్యదర్శికి వినతిపత్రాలు అందజేశారు. నాయకులు వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, మాదినేని రమేశ్, షేక్ మీరాసాహెబ్, భూక్యా శ్రీనివాసరావు, బండారు యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.1.11 లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ దంపతులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ద్వారకాపురి కాలనీలో శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి మాజీ కౌన్సిలర్ నరుకుళ్ల మమత – శ్రీనివాసరావు దంపతులు బుధవారం రూ.1.11 లక్షల విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు ద్రోణంరాజు మల్లికార్జునశర్మ, వందనపు సత్యనారాయణ, రాగాల చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్, నరుకుళ్ల రాములు, వెంకటమ్మ, నరుకుళ్ల గగన్ సాత్విక్ తదితరులు పాల్గొనగా దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం బోనస్, రైతు భరోసా జమ చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: సన్నధాన్యం అమ్మిన రైతులకు బోనస్ చెల్లించడంతో పాటు అర్హులందరికీ రుణమాఫీ చేయడమే కాక రైతు భరోసా నగదు జమ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ఖమ్మంలో జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేశ్ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రైతు రుణమాఫీ 60 శాతం, ధాన్యం బోనస్ 70 శాం, రైతు భరోసా 96 శాతం పెండింగ్ ఉందని తెలిపారు. ఇకనైనా నిధులు విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కాగా, కేంద్ర బడ్జెట్‌లో సవరణలు చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 10న హైదరాబాద్‌లో జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు తాతా భాస్కర్రావు, బండి రమేశ్, వి.ప్రసాద్, ఎస్‌కే మీరా, దుగ్గి కృష్ణ, జి.నాగేశ్వరరావు, బిక్కసాని గంగాధర్, శీలం సత్యనారాయణరెడ్డి, మల్లెల సన్మథరావు, బాణాల శ్రీనివాసరావు, బి.రమేశ్, కుసుపూడి మధు, కొల్లేటి ఉపేందర్ పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,200	6,200
కందులు	4,325	4,325
మినుములు	7,379	7,270
మిర్చి	14,000	6,000
మిర్చి తాలు	7,300	5,000
ఏసీ మిర్చి	12,600	6,000
పత్తి	7,200	5,000

– ఖమ్మం వ్యవసాయం

ఏళ్ల నాటి ఆహ్లాదం ఆవిరి

▸ దశాబ్దాల కాలం నీడనిచ్చిన చెట్లు నరికివేత ▸ ఎడారిని తలపిస్తున్న రహదారి



సత్తెమ్మ గుడి సమీపాన నీడనిచ్చిన చెట్లు (ఫైల్), (ఇన్‌సెట్) బోసిపోయి కనిపిస్తున్న రహదారి


రహదారి వెంట నరికిన భారీ చెట్టు మొదలు

ఎన్నో ఏళ్లు ఆహ్లాదం పంచుతూ ఎందరికో నీడనిచ్చిన చెట్లు ఇప్పుడు నేలమట్టమయ్యాయి. ఓ ప్రైవేట్ మిల్లుకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు గాను భారీ చెట్లను నరికివేస్తుండటంతో పర్యావరణ ప్రేమికులు, స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వేంసూరు మండలంలోని భీరపల్లి సత్తెమ్మతల్లి గుడి నుంచి శంభునిగూడెం వరకు ఏళ్ల కిందట నాటిన చెట్లు నీడనిచ్చేవి. సత్తెమ్మ తల్లి గుడి వద్ద భారీ చెట్లు పశువులు, జీవాల కాపరులకే కాక రోడ్డు వెంట చిరు వ్యాపారులు, ఆలయానికి వచ్చే భక్తులు సేద తీరేందుకు ఉపయోగపడేవి. గుడి సమీపాన ఈ చెట్ల కింద ధాన్యం కొనుగోళ్లు సాగేవి. అయితే, ఇప్పుడు ఆయా చెట్లన్నంటినీ తొలగించడంతో రహదారి బోసిపోయి కనిపిస్తోంది. ఓ ప్రైవేట్ మిల్లుకు విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం ప్రత్యామ్నాయ మార్గం ఉన్నప్పటికీ ఈ చెట్లను నరికివేయడం విమర్శలకు తావిస్తోంది. ఆర్ అండ్ బీ, అటవీ శాఖ అధికారులు స్పందించి శంభునిగూడెం మొదలు ఏపీ సరిహద్దు కొండెగట్ల అడ్డ రోడ్డు వరకు ఇంకా మిగిలిన చెట్లనైనా రక్షించాలని స్థానికులు కోరుతున్నారు. – వేంసూరు


కార్యాలయాల వెనుక చెట్లను తొలగిస్తున్న దృశ్యం

ప్రభుత్వ కార్యాలయాల్లో పచ్చని చెట్లపై వేటు

ముదిగొండ: ముదిగొండలోని మండల విద్యావనరుల కేంద్రం, మండల పరిషత్ కార్యాలయం, తహసీల్ సమీపాన ఉన్న ఏళ్ల నాటి పచ్చని చెట్లపై గొడ్డలి వేటు పడింది. ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలకు చల్లదనం ఇచ్చిన చెట్లను బుధవారం నుంచి తొలగిస్తున్నారు. అధికారులే దగ్గర ఉండి మరీ చెట్లను నరికివేయిస్తుండటం గమనార్హం. మొక్కలు నాటి ఇన్నాళ్లు సంరక్షించి ఇప్పుడు అధికారులే తీయిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో పతకాలు


సురేశ్‌బాబును అభినందిస్తున్న సీపీ సునీల్‌దత్


మజీద్, వెంకటేశ్వరరావును అభినందిస్తున్న సీఐ ముత్తిలింగయ్య, ఎస్ఐ వెంకటేశ్ తదితరులు

పెనుబల్లి/బోనకల్: ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోలీసుల క్రీడాపోటీల్లో పెనుబల్లి మండలం వీఎం బంజర్ కానిస్టేబుళ్లు పతకాలు సాధించారు. ఇందులో ఎస్‌కే మజీద్‌పాషా షాట్‌పుట్‌లో బంగారు పతకం, బి.వెంకటేశ్వరరావు, బోనకల్ మండలం నారాయణపురానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ కోటా సురేశ్‌బాబు హ్యాండ్‌బాల్‌లో కాంస్యపతకం సాధించారు. కాగా, సురేశ్‌బాబు ప్రస్తుతం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క వాహన డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి ఇటీవల సీపీ సునీల్‌దత్ ప్రశంసాపత్రాలు అందజేశారు. కాగా, మజీద్‌పాషా, బి.వెంకటేశ్వరరావును బుధవారం వీఎం బంజర్ పోలీస్‌స్టేషన్‌లో సత్తుపల్లి రూరల్ సీఐ ఎంఎల్ ముత్తిలింగయ్య, ఎస్ఐ కె.వెంకటేశ్ సన్మానించారు.

ఇనుప సామగ్రి దొంగల అరెస్ట్


స్వాధీనం చేసుకున్న వ్యాన్, చోరీ సొత్తుతో సీఐ, ఎస్ఐలు, సిబ్బంది

ఖమ్మంఅర్బన్: ఇనుప వస్తువుల చోరీకి పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన ఖమ్మం అర్బన్ పోలీసులు వారి నుంచి ఒక వ్యాన్, టన్ను కండక్టర్ వైర్, రూ 3.50 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ భానుప్రకాష్ వివరాలు వెల్లడించారు. ఖానాపురం సెంటర్‌లో పోలీసులు బుధవారం తనిఖీ చేపట్టారు. రఘునాథపాలెం మండలం రేగులచలకు చెందిన పాత నేరస్తుడు జంగా వెంకన్నతో పాటు ఇద్దరు బాలలు బొలెరో వ్యాన్‌లో వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. ఇనుమ సామగ్రి, కండక్టర్ రాగి వైర్ ఉండటంతో విచారించగా ఖమ్మం అర్బన్, కొణిజర్ల పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఎలక్ట్రికల్ షాపులు, గోదాంలలో చోరీ చేసినట్లు అంగీకరించారు. వెంకన్న, ఇద్దరు బాల నేరస్తులతో పాటు టి.అశోక్, నాగేంద్ర, నల్లా రాము, సుమంత్ చోరీల్లో పాలుపంచుకున్నట్లు తేలడంతో వైరు, నగదు, బొలెరో వ్యాన్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

బంధువులకు మహిళ అప్పగింత



మహిళను బంధువులకు అప్పగిస్తున్న దృశ్యం

మధిర: మతిస్థిమితం కోల్పోయిన మహిళను చేరదీసి ఆమె కోలుకున్నాక పోలీసుల సాయంతో బంధువులకు అప్పగించారు. కొద్ది రోజుల కిందట మధిరలో ఓ మహిళను గుర్తించిన స్థానికులు ఇచ్చిన సమాచారంతో కానిస్టేబుల్ బానావత్ కొండా వెళ్లి ఆరా తీసినా మతిస్థిమితం లేని కారణంగా వివరాలు చెప్పలేకపోయింది. దీంతో ఆర్కే ఫౌండేషన్ అనాథ ఆశ్రమంలో ఆశ్రయం కల్పించాక నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ, జ్యోతి ఆమెకు చికిత్స చేయించడంతో తనది ఖమ్మం అని చెప్పింది. అయితే, సోషల్ మీడియా ద్వారా ఎంత ప్రయత్నించినా ఆచూకీ దొరకకపోగా, చివరకు ఏపీలోని ప్రకాశం జిల్లా కంభం వాసులు గుర్తించారు. ఆమె కుమారుడు, కుమార్తె అక్కడి పోలీసులను ఆశ్రయించగా ఆర్కే ఫౌండేషన్ అనాథాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న మహిళ పేరు మెగావత్ రూప్లేబాయి అని, ఆమెది ప్రకాశం జిల్లాలోని అర్ధవీడు మండలం మావుటూరు తండాగా తేలింది. తిరుపతిలో కుమార్తె వద్దకు వెళ్లే సమయాన భర్త తులసినాయక్ నుంచి తప్పిపోయినట్లు తేలడంతో బుధవారం మధిర వచ్చిన రూప్లేబాయి కుటుంబీకులకు పోలీసు కానిస్టేబుల్ టి.శ్రీనివాసరావు తదితరుల సమక్షాన అప్పగించారు.

ఈత పోటీల్లో విద్యార్థి ప్రతిభ

కృష్ణా నదిలో 1.5 కి.మీ. దూరం ఈదిన శాన్వి


ఆవుల శాన్వి

మధిర: మధిర సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న ఆవుల శాన్వి ఈత పోటీల్లో ప్రతిభ కనబరిచింది. విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ ఎగువన ఈ నెల 2న జరిగిన ఈత పోటీల్లో పాల్గొనగా, 31.25 నిమిషాల్లో 1.5 కి.మీ. దూరాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. ఈ మేరకు పాఠశాలలో శాన్విని బుధవారం ప్రిన్సిపాల్ బేబీ, ఉపాధ్యాయులు అభినందించారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు

కామేపల్లి: ఎక్సైజ్ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. మండలంలోని బండిపాడుకు చెందిన ఈసం జ్యోతి కిరాణం షాపులో మద్యం అమ్ముతోందనే సమాచారంతో మంగళవారం రాత్రి ఎక్సైజ్ ఎస్ఐ వసంతలక్ష్మి, సిబ్బంది తనిఖీ చేయగా మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. వీటిని సీజ్ చేస్తుండగా జ్యోతి కుటుంబ సభ్యులైన ఆలెం వెంకటేశ్వర్లు, తిరుపమ్మ, మేఘన, బిందు, సింధు, భువనేశ్, సతేశ్వరి అడ్డుకోవడమే కాక చేతులతో నెట్టేశారు. అంతేకాక మద్యం బాటిళ్లు ఇవ్వకుంటే పెట్రోల్ పోసుకొని చనిపోతామని బెదిరించడంతో ఎక్సైజ్ ఎస్ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్వగ్రామంలో సినీ నిర్మాత కేపీ చౌదరి అంత్యక్రియలు

హాజరైన పలువురు నటీనటులు


కేపీ చౌదరి అంతిమయాత్రలో పాల్గొన్న బంధువులు

బోనకల్: తెలుగు సినీ పరిశ్రమలో సంచలనం సృష్టించిన డ్రగ్స్ కేసులో అరెస్ట్ అయి ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న నిర్మాత బోడెపూడి కృష్ణప్రసాద్ (కే.పీ.చౌదరి) గత సోమవారం గోవాలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఈ మేరకు ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన బోనకల్ మండలం రాయన్నపేటకు తీసుకురాగా అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన భార్య శ్రేష్ట కొన్నాళ్లుగా కుటుంబ కలహాలతో వేరు ఉంటుండగా కుమారుడు కార్తికేయతో కలిసి వచ్చారు. ఈ మేరకు కృష్ణప్రసాద్‌కు ఆయన కుమారుడు కార్తికేయ అంత్యక్రియలు చేశారు. సినీ నటులు సురేఖావాణి, జ్యోతి, దేవి, హేమ, సుప్రియ తదితరులు హాజరయ్యారు. కాగా, నటి హేమ మాట్లాడుతుండగా వీడియో తీసే క్రమాన ఓ చానల్ జర్నలిస్ట్‌పై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫొటోలు, వీడియో తీస్తే కెమెరా పగులకొడతానని హెచ్చరించడం గమనార్హం.

ర్యాష్, మైనర్ డ్రైవింగ్ కట్టడికి తనిఖీలు


వాహనాల పత్రాలు పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఖమ్మంక్రైం: మితిమీరిన వేగంతో వాహనాలు నడిపే వారితో పాటు మైనర్లు వాహనాలు నడపకుండా కట్టడి చేసేందుకు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు ఆధ్వర్యాన పోలీసులు బుధవారం ఖమ్మంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు మద్యం మత్తులో వాహనాలను నడపడం ఓ కారణమైతే మితిమీరిన వేగం, మైనర్లు నడపడం ఇంకో కారణంగా గుర్తించామని తెలిపారు. ఈ నేపథ్యాన నిరంతరం తనిఖీలు చేపడుతామని వెల్లడించారు. మైనర్లు వాహనాలతో పట్టుబడితే వారితోపాటు తల్లిదండ్రులను సైతం కోర్టులో హాజరుపరుస్తామని, తద్వారా శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే, లైసెన్స్, నంబర్ ప్లేట్ సక్రమంగా లేని వాహనాలను సైతం సీజ్ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

సాగర్ కాల్వలో గుర్తు తెలియని మృతదేహం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం గోపాలపురం సమీపాన సాగర్ ప్రధాన కాల్వలో గుర్తు తెలియని వ్యక్తి (30) మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. కాల్వ ప్రవాహంలో మృతదేహాన్ని చూసిన స్థానికులు ఖమ్మం అర్బన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సిబ్బంది చేరుకోగా, అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు బృందంతో వెలికితీయించి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లారీని ఢీకొన్న ద్విచక్రవాహనం

ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


షాజహాన్ (ఫైల్)

సత్తుపల్లిరూరల్: ద్విచక్రవాహనం అదుపుతప్పి లారీని ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సత్తుపల్లి వెంగళరావునగర్ కాలనీకి చెందిన షేక్ షాజహాన్ (32), షేక్ ఆసిఫ్ మాంసం దుకాణాల్లో పనిచేస్తుంటారు. వీరు అశ్వారావుపేటకు వెళ్లి సత్తుపల్లికి బైక్‌పై వస్తుండగా తాళ్లమడ వద్ద లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి లారీని ఢీకొట్టారు. దీంతో బైక్ నడుపుతున్న షాజహాన్ లారీ వెనుక టైర్ల కింద పడడంతో తల నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆసిఫ్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఖమ్మం తరలించారు. మృతుడు షాజహాన్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని ఎస్ఐ రఘు తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి


రమేశ్ (ఫైల్)

వైరారూరల్: మొక్కజొన్న చేనుకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. ఎస్ఐ ఎ.వంశీకృష్ణ భాగ్యరాజ్ కథనం మేరకు.. వైరా మండలం వల్లాపురానికి చెందిన వడ్డేపూడి రమేశ్ (43) మూడెకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తుండగా బుధవారం ఉదయం పంటకు నీరు పెట్టేందుకు ఆయన వెళ్లాడు. కొద్దిసేపటికి ఆప్రాంతానికి వచ్చిన రైతు లక్ష్మణ్ మోటార్ నడుస్తున్నట్లు గుర్తించి రమేశ్ కానరాకపోవడంతో గాలించాడు. బావి గట్టు మీద చెప్పులు, కండువా ఉండడంతో బావిలో గాలించగా మృతదేహం లభ్యమైంది. తాగునీటి కోసం వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెంది ఉంటాడనే అనుమానంతో ఆయన భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: ఎలుకల మందు తాగిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మం గాంధీనగర్‌కు చెందిన పందిరి లక్ష్మీప్రసన్నకుమార్ (18) పదో తరగతి ఫెయిల్ కావడంతో ఖాళీగా తిరుగుతున్నాడు. దీంతో తల్లి లింగమ్మ మందలించగా కొద్దిరోజుల క్రితం ఎలుకల మందు తాగి విషయాన్ని వాట్సప్ స్టేటస్‌లో పెట్టాడు. ఈ మేరకు బంధువులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని ఖమ్మం త్రీటౌన్ ఏఎస్ఐ నాగరాజు తెలిపారు.

మద్యానికి బానిసైన...

కారేపల్లి: మద్యానికి బానిసైన వ్యక్తి మతిస్థిమితం కోల్పోయి మత్తులో పురుగులమందు తాగగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కారేపల్లి మండలం గాంధీనగర్‌కు చెందిన ఈసం రాములు(54) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇటీవల మద్యానికి బానిసైన ఆయన మతిస్థిమితం కోల్పోగా, మత్తులోనే గత నెల 30వ తేదీన చేను వద్ద పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆయన కుమార్తె మాధవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నాగరాజకుమారి తెలిపారు.

సిగరెట్ కోసం వచ్చి గొలుసు చోరీ

పెనుబల్లి: షాప్‌లో సిగరెట్ కోసమంటూ వచ్చిన వ్యక్తి యజమాని మెడలో గొలుసు లాక్కెళ్లాడు. మండలంలోని ఎడ్ల బంజరలో ఇప్పిరిశెట్టి రామయ్య కిరాణం షాప్‌నకు బుధవారం వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి సిగరెట్, కూల్‌డ్రింక్ కావాలని అడిగాడు. దీంతో రామయ్య ఇస్తుండగానే ఆయన మెడలోని రూ.1.20లక్షల విలువైన 15గ్రాముల బంగారు గొలుసు లాక్కుని పారిపోయాడు. ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

సత్తుపల్లి బస్టాండ్‌లో చోరీ

సత్తుపల్లిటౌన్/తల్లాడ: బస్సు ఎక్కుతున్న మహిళా ప్రయాణికురాలి హ్యాండ్ బ్యాగ్‌లోని నగలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. సత్తుపల్లి మండలం బుగ్గపాడుకు చెందిన యాచమనేని రాధిక బుధవారం హైదరాబాద్ నుంచి సత్తుపల్లి బస్టాండ్‌కు చేరుకుంది. అక్కడి నుంచి బుగ్గపాడు వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా ఆమె హ్యాండ్‌బ్యాగ్‌లో ఉన్న రూ.3 లక్షల విలువైన బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. కాసేపయ్యాక గుర్తించిన ఆమె పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. అలాగే, తల్లాడ బస్టాండ్‌లో మల్లవరానికి చెందిన గాదె పద్మావతి ఖమ్మం బస్సు ఎక్కుతుండగా ఆమె చేతిలోని పర్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేశారు. అందులో ఫోన్, రూ.500 నగదు, ఆధార్ కార్డు ఉండగా పోలీసులకు ఫిర్యాదు చేసింది.

24 గంటల్లోనే చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

ఖమ్మంక్రైం: చోరీ జరిగిన 24 గంటల్లోనే నిందితుడిని ఖమ్మం వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ ఉదయ్‌కుమార్ కథనం ప్రకారం.. కారేపల్లి మండలం గంగారంతండాకు చెందిన రైతు భూక్యా మంగీలాల్ పత్తి విక్రయానికి ఈనెల 3న ఖమ్మం మార్కెట్‌కు వచ్చాడు. పత్తి అమ్మాక వచ్చిన రూ.74 వేలను సంచిలో పెట్టుకుని ఖమ్మం పాత బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్నాడు. ఆయన నుంచి గుర్తుతెలియని వ్యక్తులు నగదు చోరీ చేయగా బాధితుడు 4వ తేదీన ఖమ్మం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి ఖమ్మం వైఎస్సార్‌కాలనీకి చెందిన అబ్దుల్లాను నిందితుడిగా గుర్తించారు. ఈ మేరకు ఆయనను బుధవారం అరెస్ట్ చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు. తక్కువ సమయంలో కేసును ఛేదించిన కానిస్టేబుళ్లు హరికృష్ణ, బొర్రయ్యను నగర ఏసీపీ రమణమూర్తి అభినందించారు.

పేకాట స్థావరంపై దాడి

కల్లూరు/రఘునాథపాలెం: కల్లూరు మండలంలోని గనియాతండాలో మంగళవారం అర్ధరాత్రి ఎస్ఐ హరిక, సిబ్బంది తనిఖీలు చేపట్టి పేకాట ఆడుతున్న కల్లూరుకు చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9,040 నగదు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కాగా, పోలీసులను చూసి మరో ఇద్దరు పరారయ్యారు. అలాగే, రఘునాథపాలెంలో పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని రూ.9,830 నగదు స్వాధీనం చేసుకోగా మరో ఇద్దరు పరారయ్యారని సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.